# పెళ్ళి సందడి

మరదలు పిల్లకి పెళ్లి నిశ్చయం కాగానే, అందరిమాటా ఏమోగాని, నాకు మా ప్రాణం ఎంత కులాసా అనిపించలేదు... అయినా జరగక తప్పదు కదా !.. ఎందుచేతంటే.... మా ఊళ్ళో లేని మేనమావలూ, మరదలు లేని బావలూ, ఎందుకూ ? నవ్వు పుట్టని హాస్యం లాగ, !... మరదలికి పెళ్లి అయ్యేవరకూ ఆమె మీద హక్కు బావదే! .... అది కాస్త పోయిందన్న మాట! అందుకే నా ఏడుపు!...కాని.... ఏంచేస్తాం!... ఏ మొగుడూ దొరక్కపోతే అక్క మొగుడే అన్నట్టు - మా మరదలేం! "పో ! బావా ! పాతచింత కాయ పచ్చడి! నువెవ్వరిక్కావాలి !" అని, రెండువేల కట్నంతో కొత్త బావని కొనేసుకుంది;

నేను వెళ్ళేవరకూ, పెళ్ళికి వస్తానని ఎవరూ అనుకోలేదు. నేను చేసిన ఆలస్యం చేత, నేను వెళ్ళగానే మా ఆవిడ మొఖం చాటంత అయింది...

"ఏం అల్లుడుగారు, యింత ఆలస్యంగా వచ్చేరు !" అని పలకరించింది అత్తగారు.

"మీ పిల్ల వచ్చేసింది కదా ! యింక కొత్త మోజులో మేం కనిపిస్తామా ! మేం రాకపోతే మా ప్రాణం పెళ్ళి ఆగిపోతుందా! " అని నేను నవ్వుతూనే దెబ్బకొట్టేను. దానికెవరికీ నవ్వురాలేదు.

"కాని బావగారు సమయం చూసుకు వచ్చేరు. పాపం! అందరి టిఫిన్లూ అయిపోయి ఏవైనా మిగిలేయని ఏం తెలుసును ?" అని మా మరిది, నవ్వుతూ అన్నాడు...పట్టుకోలేని మాట అన్నాననుకొన్నాడు.

"అసలు టిఫిన్లు చేసే అలవాటు మీ యింట్లో లేదని, తినేసేవచ్చేనోయ్! కొత్తగా మొదలెట్టేరా ఏమిటి యీ నాల్గురోజులూ గొప్పకి ?" అని నేననగానే నోటికి బిరడా పడింది. అత్తమ్మా వాళ్ళు నవ్వేసేరు.

"బావా ? వచ్చేడు ?" అని ప్రశ్నార్థకంగా కలగజేసుకొని మరదలు ఒక ప్రక్కనుంచి అడిగింది... నేను అంత ఆలస్యంగా వచ్చేనని ముఖం జారీ చెంబులా పెట్టింది.

నేను తెరిపారా చూసేసరికి -

"ఏం అలా చూస్తున్నావు ? దిష్టి పెడతావా ?" అంది.

"అబ్బే, అది కాదు, నిన్ను చూసి చూసి పెళ్లాడ్డానికి ఎలా ఒప్పుకున్నాడా ! మా తమ్ముడు అని!" అని నేననేసరికి- ఆమె నవ్వుతూ ముఖం తిప్పుకుంటూ -

"ఆ సంగతి ముందు మా అక్కయ్యని అడిగి చెబుతావుండు !" అని అంటించింది.

అటు వంటి మరదలు వుండాలి ! బావ అలిగితే - బ్రతిమాలి ... స్వయంగా లాడూ, మినపసున్ని వుండలు చిదిపి యిచ్చే మరదలు వుంటే - వాడు బావ.

★★★

ఆ రోజున సంతర్పణ - వీధిలో వాళ్ళు, వచ్చేసేరు... వడ్డనలు అన్నీ అయిపోయినాయి... కాని మొగపెళ్ళి వారు రాలేదు... ఆ సగంతి సందడిలో వున్న పెద్దలెవరూ గుర్తించక... ''వడ్డించండి.. వడ్డించండి... నిలబడ్డారేం...'' అని ... అరవడం మొదలెట్టేరు... అది విని వడ్డన సంతులో వున్న ఒక ఆసామి .. '' అలాగా అయితే యింక పట్టండోయ్ మజ్జిగ... ఎవరు వచ్చినా రాకపోయినా వడ్డన మాత్రం జరిగిపోవాలి!'' అని అనగా అప్పుడు ఆడపెళ్ళి వారికి చురుకు పుట్టి పిలవడానికి పరుగెట్టారు. ఆ ఆసామి సమయోచితంగా అన్నమాటలకి తతిమ్మా వాళ్ళు నవ్వుకున్నారు.

★★★★

వడ్డన జరుగుతూంది - వడ్డించేవాళ్ల కేకలతోటీ పర్యవేక్షించే పెళ్లి పెద్దల హెచ్చరికలతోటి 'చాలు చాలు' అనో 'అది పట్రండి' 'పులుసులో ముక్కలు వెయ్యండి' అని యిలా భోక్తల మాటలవల్ల- అప్పుడప్పుడు, చదువుతున్న సంతర్పణ పద్యాల వల్ల, అగ్నిహోత్రం లోనుండి వస్తూన్న పొగతోటీ... 'అయ్యో మొహమాట పడకండి'! కొద్దిగా వేయించుకోండి!' అంటున్న... వంటవాళ్ళ మాటలతోటీ ఆ పెళ్ళి పందిరంతా కోలాహలంగా, ఆనందంగా వుంది. ఆ యింతలో ఒక వంట బ్రాహ్మడు బూరెలు పట్టుకు వచ్చేడు... అని వడ్డిస్తూ.

'బాబూ ఒక్కటి... బాబూ ఒక్కటి - వేయించుకోండి బాబూ' అని అంటూ వడ్డిస్తున్నాడు. అంటే - అతని వుద్దేశం - ఒక్కటయినా వేయించుకోండి, అని.. అలా అనుకుంటూ పోతుండగా... ఒక మాటకారి కనిబెట్టి అతగాడిని ఆపివేసి -

''ఒక్కటేమిటయ్యా ! ఒక్కటికన్నా ఎక్కువ వెయ్యవద్దని పెళ్లివారు చెప్పారా ఏమిటి ? ... ఒక్కటి... ఒక్కటి అంటావేం ? అందుకే.. అంతమందికీ తలనొప్పి పున్నా నువ్వు ఒక్కటి కన్నా ఎక్కువ వెయ్యవు కాబోలునని ఊరుకుంటున్నారు ! నాకు నాలుగు పుంజీలు కావాలి. అలాగయితే వెయ్యి ! '' అని సమయస్ఫూర్తిగా నవ్వుతూ అన్నాడు... దానికి ఆ వంట బ్రాహ్మడు చిన్నబోయి మరి ఆ మాట అనలేదు... అందరూ అతని ఛలోక్తికి తిన్న తిండి పైకి వచ్చేలా నవ్వుకున్నారు.

★★★

ఎందుచేతో గాని వియ్యపురాలు ఆ పూట భోజనానికి ఆలస్యంగా వచ్చింది. ఆవిడ ధర్మమా అని అందర్నీ ఆమెకోసం చూడకుండా తినేయమని చెప్పేసింది. ఆమె అందరి భోజనాలు అయినాక వచ్చింది. ఆమెకి పందిరిలో ప్రత్యేకంగా పీటవేసినారు.

పీరకత్తె.... సరసమాడదామని - ''యివాళ వియ్యపురాలికి మిగిలిపోయిన వంటకాలే విందు. ఏవయినా అయిపోయి ... లేకపోతే... ఏమీ అనుకోకమ్మా !'' అని అంది... నవ్వుతూ... కూరలు వడ్డిస్తూను.

''ఉంచుకుని లేదన్నా... ఒకవేళ చూస్తేనేమోనని ఎంటెంటికి దూరంగా వేసేరు!'' అని

అంది... వియ్యపురాలు!

''కాదమ్మా! ఒకవేళ వెయ్యకపోయినా వంటింట్లో పీటవేస్తే చేతికే అందుతాయి కదా! ఎక్కడ తీసేస్తారో! అని మీ పీరకత్తి భయం!'' అంది ఒకామె.

''అయినా మా వాడిని ఎలాగూ మీవాణ్ణి చేసుకున్నారు. ఇంక ఏం చేసినా తప్పుతుందా!.. కానిండి...'' అని ఆ వియ్యపురాలు నిట్టూర్చింది... అపుడు ఆడవాళ్ళందరూ నవ్వుకున్నారు.

★★★

కట్నం చదివించేఘడియ వచ్చింది. అల్లునికి కట్నం ... మామగారు చదివిస్తున్నారు. వెంటనే... రెండో అల్లుడు... ''అయ్యో! చిన్న మనవి!'' అని అన్నాడు. 'ఏమిటి?' అన్నట్లు అందరూ అటు చూశారు.

''ఈ సందర్భంలో పాత అల్లుళ్ళు మాక్కూడా ఏమయినా కట్నం ముడుతుందేమోనని!'' అని అన్నాడు.

''నీ కొడుక్కి పెళ్ళి చేసేప్పుడు అందుకుందువుగాని లేవోయ్!'' అని అతని మామగారు వెంటనే జవాబు యిచ్చేడు... అక్కడున్న అందరికీ నవ్వాలనిపించింది.

★★★

ఈ పెళ్ళి తంతులో ఒక సందర్భంలో, బావగారికి 'మరదలు మాడ' అని ఇస్తారు. మరదలిని ఎవరికీ తెలియని చోట బావగారు దాచితే, పెళ్ళి కొడుకు వచ్చి ఆమెని వెతుక్కొని, తీసుకువెళ్ళాలి - ఆ సందర్భంలో కొంత కట్నం, పెళ్ళి కొడుకు, ఆ అన్నగారికి ఇవ్వాలి.

ఈ ఘట్టం రాగానే, నేను మొదటే త్వరపడి ఒకచోట నా మరదలిని దాచేసేను. పెళ్ళికొడుకులుంగారు వచ్చి, నాలుగు ప్రక్కలా చూచి... బతిమాలుతూన్నట్టు మొహం పెట్టి నావద్దకు వచ్చాడు.

''అన్నయ్యగారూ మీ మరదలిని కనుక్కోలేను - దయ చేసి, ఎక్కడ దాచారో చెప్పండి! ఇదిగో మీ కట్నం -'' అని అన్నాడు... అందరూ మూగి ఆయనచేత ఆ మాటలనిపించి వేడుక చేస్తున్నారు...

వెంటనే నాకు స్ఫురణకు వచ్చి -

''తమ్ముడూ, అందరు బావలూ మరదళ్ళని అంత సులువుగా ఇస్తారేమో గాని... నేను మాత్రం మరదలికి తగిన జాగా హృదయం ఒక్కటే అని భావిస్తాను.... నీ దగ్గర హృదయం వుందా ?'' అని అన్నాను.

ఆ ఛలోక్తికి అందులో చమవయిన భావానికి వాళ్ళందరూ నవ్వుకున్నారు. పెళ్లకొడుకు మొహం ఎర్రబడినా... నాకే జాలివేసి... మరదలిని, అప్ప జెప్పేసేను.

★★★

కులాసాగా అందరూ కబుర్లు చెప్పుకుంటున్నాం. మాటల్లో మాటవచ్చి జ మసండు మా మావగారు లినను అని అన్నాడు... వెంటనే 'ఎంచేత' అని ప్రశ్న.

'' ఆ మధ్య యాత్రలకి వెళుతున్నప్పుడు మీ అత్తగార్కి చచ్చినంత చేస్తే... అది లినసని

వదిలేసేను !'' అని ఆయన మామూలుగా జవాబు చెప్పేడు, చెబుతూ ఎందుకో భార్యవయిపు చూశాడు.

''ఇంకా నయం నన్ను వదిలేసి వచ్చేరు కాదు! ఎంత అభిమానం... ఆముదం తాగను అని దాన్ని వదిలేసి వచ్చేరు కాదు ! ఇష్టం లేదని అనరాదూ ?'' అని చెప్పుతూ, వేళాకోళం చేసింది. ఆ ప్రౌఢదంపతుల్లో సాగుతున్న హాస్యం గ్రహించి నవ్వు కున్నారందరూ...

★★★

తర్వాత ఆడవాళ్ళందరూ శోభనంగది ముస్తాబు గురించి మాటాడుకుంటున్నారు... అక్కడికి నేను చల్లగా వెళ్లేను.... వాళ్ళని నవ్విద్దామని.

''ఏ ఏ గదులు ఏర్పాటు చేశారు ?'' అని అడిగేను మామూల్గా !

''గదులా ! ఆ బహువచనం ఏమిటి ? మీ మరదలికొక్కలికే... శోభనం -'' అంది మా ఆవిడ నాకు తెలియనట్టు

''అబ్బే... అది కాదు.. ! మరి మన సంగతో ! ... ఆ ప్రక్క గది కూడా... మన కోసం ... ఏర్పాటు చేస్తారేమో అని...'' అని నేను అనేసరికి.... అందరూ పక్కలు పట్టుకు నవ్వేరు కాని -

''బావుంది. వేళాకోళం... మంచీ మర్యాదా ! అక్కర్లేదు. కొత్తసారి పెళ్లికొడుకులా ఏమిటా ముచ్చట !'' అని మొహం చిట్లిసూ ముసిముసి నవ్వులు నవ్వుతూ అంది మా ఆవిడ.

★★★

విందులు కమ్మగా తిని తాంబూలం వేసుకుందాం అని అనుకుంటూ వున్నాను. ఇంతలో మా బావ వచ్చి,

''ఏం బావగారూ తీరుబాటుగా కూర్చున్నారు ?'' అని కుశల ప్రశ్న వేశాడు.

''ఏం చేయడంవోయ్! మీ అక్కగారికి నేనం ఎక్కడా కనిపించడంలేదు. యింక బానమరుదులా... పెళ్లిపెద్దలు ... మా సంగతి ఎవరిక్కావాలి!'' అన్నాను సరదాగా...

''అయ్యయ్యో ! ఎంతమాటండీ ! నేనున్నాను గదూ మీ సంగతి కనుక్కుందికి. మీ కిప్పుడొచ్చిన యిబ్బంది ఏమిటి ?''

''భోజనం కాగానే తాంబూలం మీ అక్కయ్య ఇచ్చేదోయ్ !'' అన్నాను....

''ఓస్ యింతేనా ! యిదిగో యిందండి. యింట్లో ఆకులు చెక్కలే అని... కొట్టునుండి తెప్పించేను. యీ కిల్లీ వేసుకోండి'' అని చెప్పి యిచ్చేడు...

అది నోట్లో వేసుకు నములుద్దనుకదా... ఆ రాకం ఎత్తిపోయింది.... తీసి చూద్దును.. పచ్చిమిరపకాయ అందులో వుంది... బుర్ర రింగుమంటోంది. కళ్ళంట ముక్కంట నీళ్ళు. నోటంట లాలాజలం వస్తూంది. హాస్యం పేరుని యింతలా ఏడిపించిన వాడిని మూసి కొడదామన్నంత కోపం వచ్చింది. ఉడుక్కుంటున్నానంటారని వూరుకున్నాను.

యీ విధంగా నానాబాధ పడుతూంటే అవతల మా బావ నవ్వుట్లు కొడుతూ, నవ్వుతూ, ''బావగారూ, బావుందా !'' అని అంటూ అందర్నీ పిలిచి మాబెట్టేడు. అందరూ కలిసి విరగబడి

నవ్వడం మొదలెట్టేరు... చేసేది లేక నేనూ వారితో కలిసి ఏడవలేక నవ్వేసేను.

★★★★

ఇంక పెళ్ళికి వచ్చిన, పెళ్ళికాని యువతులూ యువకులూ వుంటారు చూడండి!... అక్కడక్కడ అప్పుడప్పుడు... కొందరు, సరసాల్లో పడి, హాస్యం ఆడుకుంటూ వుంటారు. అవి కొంచెం రహస్యంగా వుంటాయి, రహస్యంగానే వుండాలి కూడా. వాళ్ల ఆడుకొనే సరసాలు, బాజాల చప్పుడులోనూ పెళ్ళి పందిరిలో కోలాహలంలోనూ కలిసిపోతూ వుంటాయి. సరసాలయితే - ఏదో అందిస్తున్నట్లో - లేక - మరొకరిని అనుకొని.... పొరపాటున, వారిని - తాకినట్టు చేస్తూ... భుజాలూ భుజాలూ రాసుకుంటూండడం. యిలా జరిగిపోతాయి... వారి మధ్య జరిగే సరసాలు, పెళ్ళిసందడిలో ఎవరూ గుర్తించరు. కొంగు తగిలితే చాలు కోటివేలని - వాళ్ళు భావిస్తూ వుంటారు. ఆ యువకులకు ఆఖరికి - యువతులు వాడగా వాడిపోయిన పూలచెండ్లు, రిబ్బను ముక్కలు, జ్ఞాపక చిహ్నంగా మిగులుతాయి.

పెళ్ళికి వెళ్లగానే, యిలాటి అమ్మాయిలు, వున్నారా? అని వెతుకుతాయి యువకుల కళ్లు... ఎవరినయినా చూశాక... ఆమెకి చక్రం వేస్తాడు... ఆమె సుగుణాలు నానా బాధపడి కనుక్కుంటాడు, పేరు తెలుసుకుంటాడు. ఆమె తరఫున వచ్చిన చిన్న పిల్లలని - అంటే అన్నదమ్ముల్ని, చెల్లెళ్ళని మచ్చిక చేస్తాడు... పరిచయాలు, జరుగుతూంటే.. వూరికనే భోగట్టాకి అడిగినట్టు "ఆ ప్రక్క నుంచుందే... ఆ పిల్ల ఎవరు? ఎప్పుడూ చూడలేదే? ఎవరి తాలూకూ?'' అని తెలుసుకో చూస్తాడు.

ఆ పిల్లగాని యీ సంగతి కనిపెట్టి యిష్టం లేకపోతే తప్పించుకొని అయిష్టత చూపిస్తుంది. .. లేదా అందరూ కలిసి కూర్చున్న సమయాల్లో... వచ్చి ... తనూ వచ్చేసిన తెలియడానికి అతగాడి ముందునుండే పోయి క్రీగంట చూస్తూ అతనికి సూటిగా కూర్చుని, ముసిముసిగా ఒకసారి చీర కుచ్చిళ్ళు సర్దుకొని... చిరునవ్వు నవ్వుతూ తనతో కూడా వున్న చెలిని అంటిపెట్టుకుంటుంది.

ఇటు ప్రక్క నుండి యీతడు, బాణాలూ వేస్తూ వుంటాడు... ఆమె ప్రక్కనుండి వెళుతున్నపుడు... ఆమె పేరు... ఉచ్చరిస్తూ.... ''కమల అని ఒకతె, మా క్లాసుమేటు'' అని ఎత్తుతాడు. ఆమెకి అర్థమయిపోతుంది....

''దూరంనుండి ఏం లాభం... పాపం పెళ్ళికూతురికి చెడ్డ సిగ్గురా!...'' ''ఇంక వెళ్ళి వచ్చినపుడు... ఫలానా దగ్గిర వుంటా... తప్పకుండా అలాగేరమ్మా! చూస్తూ వుంటా!'' అని తన స్నేహితునితో - అంటున్నట్టుగా, ఆమెకు వినబడేట్టు అంటాడు.

ఇష్టమయితే, ఆమె ఒకచెవి పారేసి... ఒక్కసారి చిరునవ్వు నవ్వి వూరుకుంటుంది. లేకపోతే..

''అసహ్యం..... చూస్తే... ఏమనుకుంటున్నావో!'' అని తనతో వున్న ఆమెతో ఏదో మాటకి జవాబు చెప్పినట్టు... హెచ్చరించి విదిలించుకు వెళ్ళిపోతుంది.

ఒక్కొక్కప్పుడు అనుకోకుండా యిలాటి యువతీ యువకుల మధ్య. పెళ్ళిళ్లు నిశ్చయం అయిపోతాయి కూడాను. పెద్దవాళ్ళూ, పెద్దవాళ్ళూ... తాంబూలాలు పుచ్చుకుంటారు!

★★★

ఇలా ఒకరినొకరు ఆడుకొనే హాస్యాల మాట - అటుంచి, ..అసలు పెళ్ళిళ్ళలో కొన్ని, ఘట్టాలే, హాస్యంతో కూడినవయి వుంటాయి... ఆ ఆచారాల మాట, ఆ సంఘటనలకి అర్థం అటువుంచి - అందులో గల, సున్నితం, హాస్యం, ఆనందం, తీసుకుందాం. అవి జరుగుతూంటే మనం సంతోషిస్తూ వుంటాం... మచ్చుకి -

★★★

విడిదినుండి పెళ్ళివారింటికి పెళ్ళికొడుకు - వచ్చినపుడూ, పెళ్ళికూతురు విడిదికి వెళ్ళిన ప్పుడూ వధూవరులని గుమ్మాల దగ్గర నిలబెట్టించేస్తారు... వారిద్దరి చుట్టూ యీ ఆడంగులందరూ చేరి - ఊపిరి సలపనివ్వకుండా, వారిచేత పేర్లు చెప్పించి వేడుకగా, ఆనందిస్తారు.

పెళ్లికొడుకయితే - ఆమె పేరు పెట్టి పిలుస్తూ '' తలుపు తియ్యి వచ్చేను!'' అని బలిమాల ఁ. అని అనగా అనగా... '' తీస్తున్నానండి'' అని ఆమె అనాలి! అతడి వంతు వస్తే అతనూ అనాలి! ఆమె చేత అనిపిస్తారు!.. అప్పుడు వాళ్ళు సిగ్గుపడుతూ, ముసిముసి నవ్వుతో ఘంటకో అక్షరం పలకగా... విని ఆనందిస్తారు. ఒక్కసారి అనేస్తే తీరిపోతుందా ? అబ్బే! ' మాకు వినబడలేదనో!' ...'పేరు పూర్తిగా చెప్పలేదనో !'....'దగ్గరగా వున్న మాకే వినబడకపోతే యింక లోపల వున్న మీ ఆవిడ కెలా వినబడుతుంది ...' అనో! వాదించి మరో రెండు మూడు మారులు అనిపించి, సంతోషిస్తారు.

★★★

నాగవల్లిలో అలకపాన్పు దగ్గిర ఎంత హాస్యంతో జురుగుతుందో తంతు! అల్లుడు అలగడం, ఆ అలక తీర్చడం అది అటు వుంచండి. పచ్చని పందిరిలో, వెన్నెల పరచినటువంటి తెల్లని పక్కమీద వధూవరులని కూర్చోబెడతారు. దూర దూరంగా సిగ్గుతో కూర్చుంటే, పెళ్ళికూతురు రెక్కపట్టుకొని యీడ్చుకు వచ్చి పెళ్లికొడుకు దగ్గిరగా కూర్చోబెడతారు... పాపం.... పెళ్లికొడుక్కి స్పర్శ జ్ఞానంవల్ల మతిపోతూ వుంటుంది. తర్వాత వారిద్దరికి మధ్య పుయ్యాల కడతారు. అందులో చందనపు బొమ్మని పడుక్కోపెట్టి, వసంతం పోసి అది వారి పాప అని చెప్పి, వూచుతుంటారు. రాబోయే సాంసారిక జీవితానికి రిహార్సలు చేయిస్తారు.

ఆ బొమ్మని పెళ్ళికూతురికి యిస్తారు... ఆమె ఏం చెయ్యాలి ? - ''వంట వండుకోవాలి ! పిల్లాణ్ణి కాస్త - ఆడిద్దురూ!'' అంటూ భర్త చేతికివ్వాలి ! - మరి, లజ్జపడుతూ వెనక్కి తగ్గుతూ, ముగ్ధగా, ఆ పెళ్ళికూతురు తప్పించుకో బోతూంటే, బలవంతాన్ని ఆమె చేతిలో కుక్కి అనుమంటారు... ఆమె ముఖం ఎర్రగా చేసుకొని , సిగ్గుతో సన్నంగా నవ్వుతూ, భర్తచేతులెక్కడున్నాయో కూడా - చూసీ చూడకుండానే మౌనంగా ఏ ఒడిలోనో పడేస్తుంది! కాని ఈ ఆడవాళ్ళు వూరుకోరు. ఆలస్యం చేస్తున్న కొద్దీ యిబ్బంది పెడతారు. ఒకటికి రెండుసారులు చేయవలసి వస్తుంది. అంచేత అక్షరం అక్షరానికి తోస్తూ ఎలాగో ఆమె చేత ఆ నాలుగు ముక్కలూ అనిపించి వదులుతారు ! ఆమె వద్దనుండి అందుకున్నాక పెళ్లికొడుకు కూడా తిరిగి ''ఆఫీసుకి వేళయింది యీ పిల్లాడిని తీసుకో!'' అని చెప్పి తిరిగి యిచ్చివేయాలి. అక్కడికి వారు పూర్తిగా ఆనందించి వదులుతారు.

★★★

ఇంక అందరి సమక్షంలోనూ వధూవరులను భోజనాలకి కూర్చోబెట్టి, బూజం బంతులు ఆడిస్తారు. అందరి పంక్తిలోనూ వారిద్దరూ కూర్చుని, ఒకరి విస్తరిలో ఒకరు వారు ఎంక్కోరుకు కొరికిన పదార్థాలని, వేసుగుంటూ, ఒకరు తిన్నది మరొకరు తినాలి. ఇలా తను తను ఎంగిలి తినడానికి వధూవరులిద్దరికీ అన్నుల ప్రాయమయినా పైకి మాత్రం బెట్టు చేస్తూంటారు. సిగ్గువల్ల ఒకసారో రెండుసార్లో చేసి పూరుకుంటే చుట్టూ వున్న వాళ్లు మరి మరీ వేయించి, చేయించీ చూసి ఆనందిస్తారు! ఇలాటి సందర్భంలోనే ఒక రసికుడయిన పెళ్ళికొడుకు మిరపకాయ పిడచలో కనబడకుండా పెట్టి భార్యకి తినిపించి ఏడిపించేడు! - యీ విధంగానే, వియ్యపురాళ్లు, వీరకత్తెలు కూడా జరుపుకుంటారు. యీ ఆనందం - ఎందుకు పోవాలని తతిమ్మా జంటలు అంతా కూడ ఒకరి విస్తట్లో ఒకరు తెలియకుండా వంటకాలు పడేసుకొని సంతోషిస్తారు.

★★★

''కొట్నాలదంపు'' అనే తంతులో, వీరకత్తె, వియ్యపురాలూ రోకళ్ళతో తమాషాగా బుగ్గలు పొడుచుకుంటారు. అది చూసిన వారికి, పళ్ళు వూడినట్టు పొడుచుకుంటే బా వుండునని పిస్తుంది! యింకా యిలాటి సుట్టాలు ఎన్నో అడుగడుగునా, మనకి, హాస్యం పుట్టిస్తాయి

★★★

పెళ్ళికూతురూ పెళ్లికొడుకూ, యీ ఇద్దరి చుట్టూ , ఎప్పుడూ యింత మంది చేరి వుంటున్నా... అంత సందడిలోనూ కొత్తగా పరిచయస్థులయిన ఆ నూతన వధూవరులు కూడా అవకాశాలని జారవిడుచుకోరు సుమండీ -

చేతులు పట్టుకొని అగ్నిహోత్రం చుట్టూ తిరుగుతున్నపుడు వ్రేలు నొక్కడంలోనూ అరచేతిలో గోకడంతోనూ - పెళ్లికొడుకు ప్రారంభించేసరికి, అలా చేయకుండా అతని చేతిని అదిమి పట్టడంతో ఆమె ఆరంభించుతుంది! ఇక వూరేగింపులోనూ, తలంబ్రాలు పోసుకోడంలోనూ సరసాలు చాతుర్యంగా సాగిపోతూ వుంటాయి. ఏకంగా పళ్లేలతోనే తలంబ్రాలు గుమ్మరించేసు కుంటారు.

పానకం బిందెల్లో బంగారం, వస్తువు తీసుకొనేప్పుడు, ఆ దంపతులిద్దరు, వస్తువు మాటు అటుంచి చేతులు కలుపుకోడంలో తన్మయం చెందుతారు. ఆఖరికి ఆ వస్తువుకోసం గిల్లుకుంటారు కూడా! ఎవరికో ఒకరికి దొరికాక -

''ఎంత దారుణం అమ్మా! మొగుణ్ని ఇలాగేనా గిల్లేస్తుంది - యింక దీనితో మా వాడు ఎలా వేగుతాడో?'' అని పెళ్లికొడుకుని వెనకేసుకు వస్తుంది ఒకామె.

'అయ్యో! ఎంత నంగనాచి అమ్మా! చూడు పువ్వులాంటి చెయ్యి ఎలా రక్తం కారోతోందో అమ్మాయికి! యిలా అయితే దగ్గిరకే రానివ్వదులే!' అని పెళ్లికూతుర్ని వెనకేసుకు వస్తుంది ఒకామె అందరూ కిలకిలా నవ్వుకొని ఆనందిస్తారు.

★★★

బంతులాట ఆడించినపుడు, పెళ్లికొడుక్కి మంచి అవకాశం వుంది. అతడేగా నిపుణుడయితే- తతిమ్మావారిని లెక్క చేయకుండా సూటిగా ఏ వక్షస్థలం మీదో గురిచూసి విసురుతూంటాడు.

కొందరయితే ధైర్యం చేసి పెళ్లికూతురికి ప్రక్క ప్రక్కల కూర్చున్న వాళ్ళ మీదికి కూడా పొరపాటున చేయి జారినట్టు నటించి కోరుండి విసురుతారు.

ఇలాంటి సంఘటనలు ఎన్నో పెళ్ళిళ్లలో అనేక రీతులుగా జరిగిపోతూ వుంటాయి. ఎన్నో సందర్భాలు కలిసి వస్తూంటాయి. పెళ్ళిలో ప్రతిది హాస్యంతో కూడే వుంటుంది. జరిగే తంతులోనూ హాస్యం మిళితమయే వుంటుంది. ఆ వాతావరణం, జరిగే విషయాల ప్రభావం, యిదంత అనుకూలముగా వుండి అడుగడుగునా, మాటిమాటికీ, హాస్యం ఉద్భవిస్తూ వుంటుంది. అవి అన్నీ కూడా మన సంస్కృతి, సాంప్రదాయం, ఆచారం, మతం, శాస్త్రం, వీటిపైన ఆధారపడి వుండి, గొప్ప అర్థాన్ని చాటుతూ, భావగర్భితమై, ఆశీర్వచనాలవలె పనిచేస్తూ ఉన్నతమైన హాస్యాన్ని కలిగి వుంటాయి. వచ్చిన వారందరికీ ఎల్లప్పుడూ, నవ్విస్తూ, సంతోషపరుస్తూ ఒక చైతన్యాన్ని, ఒక ఉత్సాహాన్ని మంచి మరువలేని అభిప్రాయాలని కలిగిస్తూ వుంటాయి. విచారానికి తావులేకుండా అన్నీ మరచి ఆనందమయులవుతారు.

ఈ వేడుకంతా స్వయంగా పెళ్ళికి వెళ్ళి అనుభవించవలెగాని, చెప్పినా, చదివినా, మజాగా వుండదు. అందుకే పెళ్ళికి పిలిస్తే చాలు వెళ్ళితీరాలి.

★ ★ ★

*(ఆంధ్రవారపత్రిక 28-8-1957.)*